నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | ఆదివారం 17 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## ఘనంగా మదనపోచమ్మ జాతర



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోటపల్లి, నవంబర్ 16 : కోటపల్లి మండలం జనగామ గ్రామంలో మదనపోచమ్మ జాతర వైభవంగా కొనసాగుతున్నది. కోటపల్లి మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కాగా సందడి పండుగ వాతావరణం ఏర్పడింది. అమ్మవార్ల రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌కు మార్లవాయి గుస్సాడీ బృందం



జైనూర్, నవంబర్ 16: పద్మశ్రీ అవార్డు గ్రహీత, కీ.శే. కనకరాజు గుస్సాడీ టీంకు అరుదైన అవకాశం లభించింది. ఈ నెల 20 నుంచి 28 వరకు గోవాలో ప్రపంచ దేశాల ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ జరగనుంది. ఈ ఫెస్టివల్‌లో వివిధ దేశాల నుంచి బృందాలు పాల్గొననున్నా యి. ఇందులో మన దేశం నుంచి 9 రాష్ట్రా ల నుంచి కళాకారులు సాంస్కృతిక కళలను ప్రదర్శించనున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కుమ్రం భీం జిల్లా జైనూర్ మండలంలోని మార్లవాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ కనకరాజు గుస్సాడీ బృందానికి అవకాశం లభించినట్లు టీం లీడర్ కనక సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్ర సాయిరాజ్, జుగనక. సంజయ్ కుమార్, మెస్రం లక్ష్మణ్, సోయం రమేశ్, సిడం. గోపాల్, ఆత్రం అర్జున్, శ్రీకాంత్, మెస్రం నవనాథ్, ఆత్రం హన్మంతరావు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఎంసీహెచ్‌లో సీడీఎస్ సెంటర్

- జిల్లాలోని దవాఖానలకు మందుల సరఫరాకు తొలగిన ఇబ్బందులు
- సేవలను ప్రారంభించిన వైద్యాధికారులు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 16 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ (మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం)లోనే ఔషధ గిడ్డంగి (సీడీఎస్) సెంటర్ ప్రారంభమైంది. గతంలో మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలకు మందులు కావాలంటే ఆదిలాబాద్ సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి తీసుకురావాల్సిందే. అక్కడి నుంచి తీసుకురావాలంటే తరచూ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ వైద్య మిషన్ పథకంలో భాగంగా ఎంసీహెచ్‌లో నాలుగు ప్రత్యేక గదుల్లో సీడీఎస్‌ను ఏర్పాటు చేసి అధికారులు సేవలను ప్రారంభించారు. దీంతో ఔషధాలకు ఇక ఇబ్బందులు తొలగినట్లేనని వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ కేంద్రానికి అవసరమైన మందులను హైదరాబాద్ సీడీఎస్‌తో పాటు ఇతర కంపెనీల నుంచి నేరుగా సరఫరా కానున్నాయి. ఇప్పటి వరకు 70కి పైగా రకాల మందులు డ్రగ్ సెంటర్‌కు వచ్చాయని, రోజు కొన్ని కొన్ని వస్తున్నట్లు, మరిన్ని రావాల్సి ఉంది.




ఎంసీహెచ్‌లో ఏర్పాటు చేసిన డ్రగ్ కంట్రోల్ సెంటర్

### తొలగిన ఇబ్బందులు..

గతంలో జిల్లాలోని ప్రభుత్వ దవాఖానలకు మందులు కావాలంటే ఆదిలాబాద్‌లో ఉన్న డ్రగ్ సెంటర్‌కు వెళ్లి ఓ ప్రత్యేక వాహనంలో మందులు జీజీహెచ్‌కు తీసుకువచ్చి ఇక్కడి నుంచి పీహెచ్‌సీలకు తదితర ప్రాంతాలకు తరలించేవారు. ఉమ్మడి జిల్లాకు ఒకే డ్రగ్ సెంటర్ ఉండే సరికి మందులు కూడా సరైన సమయంలో సరఫరా అయ్యేవి కావు. దీంతో రోగులు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రైవేట్‌లో కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉండేది. మంచిర్యాలలో ప్రత్యేక డ్రగ్ సెంటర్ ఏర్పాటు చేయడంతో ఆదిలాబాద్ 4 గంటల దూరం ప్రయాణ భారం కూడా తగ్గింది.

### సీడీఎస్‌లో ఆరుగురు సిబ్బంది అవసరం..

ఎంసీహెచ్‌లో ఏర్పాటు చేసిన డ్రగ్ సెంటర్‌లో ఆరుగురు సిబ్బంది అవసరం ఉంటుంది. ప్రస్తుతం ఫార్మసీ సూపర్ వైజర్, ఫార్మసిస్ట్ మాత్రమే ఉన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ప్యాకర్లు, వాచ్‌మెన్, మందుల రవాణా కోసం ప్రత్యేక వాహనం కావాల్సి ఉంది. ప్రస్తుతానికి ఒక హైయర్ వెహికిల్‌లో మందులను సరఫరా చేస్తున్నారు. సీడీఎస్ ఏర్పాటు పనులు ఇంకా జరుగుతున్నాయి.

### ఆన్‌లైన్ ద్వారా సేవలు..

జిల్లాలో 17 పీహెచ్‌సీలు, 4 యూపీహెచ్‌సీలు, 3 ప్రభుత్వ దవాఖానలు, మాతా శిశు సంరక్షణ కేంద్రం, జీజీహెచ్, 3 బస్తీ దవాఖానలు ఉన్నాయి. ఆయా కేంద్రాలకు అవసరమైన మందులను ఆన్‌లైన్లో ఇండెంట్ నమోదు చేస్తారు. అనంతరం సీడీఎస్ నిర్వాహకులు ప్రత్యేక వాహనంలో నేరుగా దవాఖానకే మందులను సరఫరా చేస్తారు.

### సేవలను ప్రారంభించాం..

-శ్రీవాణి, మంచిర్యాల ఔషధ గిడ్డంగి ఇన్‌చార్జి

జిల్లా కేంద్రంలో ఎంసీహెచ్‌లో ఏర్పాటు చేసిన డ్రగ్ సెంటర్ నుంచి మందుల సరఫరాను ప్రారంభించాం. ఆన్‌లైన్లో ఇండెంట్ చేసుకుంటే ఇక్కడి నుంచే ఆయా దవాఖానలకు మందులు సరఫరా చేస్తాం. ప్రస్తుతానికి 70 కి పైగా రకాల మందులు చేరాయి. ఇంకా రావాల్సి ఉంది.



మంచిర్యాల డ్రగ్ సెంటర్‌కు చేరిన మందులు



మందులను పరిశీలిస్తున్న డ్రగ్ సెంటర్ నిర్వాహకులు

# జోరుగా మట్కా దందా



- ఈజీ మనీకి అలవాటు పడి కేసుల పాలవుతున్న యువత
- ఇటీవల కాగజ్‌నగర్‌లో పట్టుబడ్డ ముగ్గురు మైనర్లు
- జూదరులపై పోలీసుల నిఘా

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మట్కా దందా జోరుగా సాగుతున్నది. మట్కా మాఫియా రోజురోజుకూ అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, వాంకిడి, ఈస్‌గాం తదితర ప్రాంతాల్లో జోరుగా సాగుతున్నది. సులభంగా డబ్బులు సంపాదించవచ్చనే అత్యాశతో మట్కా వ్యసనానికి పేద, మధ్య తరగతికి చెందిన జూదరులు బానిసై డబ్బులు పోగొట్టుకొని వారి కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారు. పొరుగున్న ఉన్న మహారాష్ట్రలో మట్కా దందాకు అనుమతి ఉండడంతో దాని ప్రభావం జిల్లాపై పడుతున్నది. రాష్ట్రంలో మట్కా నిషేధించినప్పటికీ కొంత మంది యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా సెల్‌ఫోన్‌ల ద్వారా ఆడుతున్నారు. గతంలో ఆడి మానేసిన వారు సైతం మళ్లీ ఆ ఆటకు బానిసలవుతున్నారు. ఇటీవల కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీ పార్క్ ఏరియాలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న ముగ్గురు మైనర్లను ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### ఆన్‌లైన్‌లో మట్కా..

మట్కా నిర్వహణ కొత్త పుంతలు తొక్కుతున్నది. నిర్వాహకులు ఏజెంట్లను నియమించుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ జోరుగా దందా కొనసాగిస్తున్నారు. ఒకప్పుడు చిన్న కాగితంపై నంబర్ రాసుకొని రిజిస్ట్రేషన్ చేసి ఆడేవారు. సెల్‌ఫోన్లను వినియోగించుకొని ఆన్‌లైన్ ద్వారా ఆడుతూ బానిసలవుతున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులతో ఎవరికీ పెద్దగా అనుమానం రాదు పోలీసులు తనిఖీలు చేసిన నగదు పెద్దగా లభించదు, అందుకే నగదు చెల్లింపులను యూపీఐ పేమెంట్ల ద్వారా చేస్తున్నారు.

### వేలాది రూపాయలు పోగొట్టుకుంటున్న జూదరులు

మహారాష్ట్రలోని ముంబాయి, బల్లార్ష, వని ప్రాంతాల్లో ఉన్న నిర్వాహకులు వివిధ పేర్లతో మట్కా నిర్వహిస్తున్నారు. మట్కా చీటీలను రాసే వారికి పెద్ద మొత్తంలో కమీషన్ అందుతున్నట్లు సమాచారం. కాగజ్‌నగర్‌లో ఏజెంట్లు చీటీలు రాయడం, డబ్బులు వసూలు చేసే నిర్వాహకులకు పంపిస్తుంటారు. చిరువ్యాపారులు, డ్రైవర్లు, సామాన్యులకు మాయ మాటలు చెబుతూ ఏజెంట్లు డబ్బులు సేకరిస్తూ చీటీలు రాస్తారు. ప్రతి రోజూ సాయంత్రం ఆన్‌లైన్‌లో వచ్చే నంబర్లను సెల్‌ఫోన్ ద్వారా ఏజెంట్లకు చేరవేసి గెలిచిన వారికి ఆన్‌లైన్ ద్వారానే డబ్బులు చెల్లిస్తుండడంతో దందా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నది. మట్కాలో వేలాది రూపాయలు పోగొట్టుకుంటూ చాలా మంది బాధితులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

### మట్కా మాఫియాపై పోలీసుల నిఘా..

ఆన్‌లైన్ మట్కా గేమ్‌ల నిర్వహణ అడ్డుకునేందుకు పోలీసులు నిఘా పెట్టారు. తరచుగా నిషేధిత ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న వారిని పట్టుకుంటున్నారు. ఇటీవల కాగజ్‌నగర్‌లోని గాంధీ పార్క్ ఏరియాలో ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న ముగ్గురిని సీఐ రాజేంద్ర ప్రసాద్‌పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్‌లు స్వాధీ నం చేసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న ఆన్‌లైన్ మాట్కాపై పోలీసులు మరింత పటిష్ట నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. పట్టుబడితే చిన్నపాటి కేసులు, జరిమానాలతో సరిపెడుతుండడంతో నిర్వాహకులు యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నా రు. నిర్వాహకులపై, ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి



కాగజ్‌నగర్‌లోని కస్తూర్బాలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



పెంచికల్ పేట్‌లోని కస్తూర్బాలో కూరగాయలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

- విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కాగజ్‌నగర్, నవంబర్ 16: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని అధికారులు, సిబ్బందిని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. శనివారం జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులతో భోజనం అందించాలని తెలిపారు. మ్యాథ్స్ బోధించే ఉపాధ్యాయులు లేరని విద్యార్థులు తెలుపగా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారిని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలు వినియోగించుకొని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో ప్రభాకర్, ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

పెంచికల్ పేట్, నవంబర్ 16 : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కస్తూర్బా విద్యాలయం అధికారులు, సిబ్బందిని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. శనివారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, వంటగది, స్టోర్ రూమ్, రికార్డులు హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో కూరగాయలు తాజాగా లేకపోవడంపై ఎస్వో కవితపై మండిపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలను వివరించారు. విద్యాలయంలో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. అంతకుముందు వరి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీసీఏవో మహిమూద్ అలీ, ఏడీఏ మనోహర్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఏవో మనీషా, ఏఈవోలు శివ, శ్రీ విద్య ఏపీడీ రామకృష్ణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ నవీన్, పీఏసీఎస్ సెక్రటరీ సత్య నారాయణ గౌడ్ సెంటర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్‌కు కారకులపై చర్యలు తీసుకోవాలి

- మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యామ్ రావు
- విద్యార్థిని శైలజ కుటుంబ సభ్యులకు పరామర్శ

కాగజ్‌నగర్, నవంబర్ 16: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడిలోని ఆశ్రమ పాఠశాలలో గత నెలలో ఫుడ్ పాయిజన్‌కు కారకులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు లెండుగురే శ్యామ్ రావు డిమాండ్ చేశారు. ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన మాలి వర్గానికి చెందిన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని దరి శైలజ తండ్రి తుకారాంను హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో శనివారం శ్యామ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్‌కు కారకులైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, తెలంగాణలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే విద్యాశాఖ తన దగ్గర పెట్టుకొని విద్యార్థి జీవితాలను అంధకారంలో నెట్టేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి విద్యార్థి దరి శైలజకు మెరుగైన వైద్యం అందించాలని, లేదంటే భవిష్యత్‌లో జరిగే పరిణామాలకు అధికారులు, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.



హైదరాబాద్‌లోని నిమ్స్‌లో శైలజ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకులు





ఆసిఫాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

# 'గ్రూప్-3'కి ఏర్పాట్లు పూర్తి

- మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్లు కుమార్‌దీపక్, వెంకటేశ్ ధోత్రే
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

నస్పూర్, నవంబర్ 16 : జిల్లాలో ఈ నెల 17,18 తేదీల్లో జరగనున్న గ్రూప్-3 పరీక్ష కోసం 48 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలో 15,038 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అన్ని కేంద్రాల్లో నోడల్ అధికారులు, కో ఆర్డినేటర్లు, పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకు , మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షా కేంద్రానికి రావాలని ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు గేట్లు మూసివేయనున్నట్లు తెలిపారు. ఫొటో గుర్తింపు కార్డు, హాల్ టికెట్ తెచ్చుకోవాలన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వకు పేపర్ 1, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్ 2, ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 3 పరీక్షలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

### అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

కాగజ్‌నగర్, నవంబర్ 16: గ్రూప్-3 పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్‌లో పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పరిశీలించారు. జిల్లాలో 18 పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### హాజరుకానున్న 4471 మంది అభ్యర్థులు..

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 16: గ్రూప్-3 పరీక్ష కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నరసింహం తెలిపారు. జిల్లాలో ఆసిఫాబాద్‌లో 9, కాగజ్‌నగర్‌లో 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసిఫాబాద్‌లో 2304, కాగజ్‌నగర్‌లో 2167 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాల్లో డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు చేసినట్లు తెలిపారు.

### పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ..

జిల్లాలో గ్రూప్-3 పరీక్షాల కేంద్రాలను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పరీక్ష కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ కరుణాకర్, సీఐ రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గురుకులంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

# మా ఉద్యోగాలు మాకు ఇవ్వాలి

### శ్రీరాంపూర్ ఓసీపీ కార్మికుల ధర్నా

శ్రీరాంపూర్, నవంబర్ 16 : తమను అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగించారని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ ఓసీపీ భూనిర్వాసిత గ్రామాలైన తాళ్లపల్లి, సింగాపూర్‌కు చెందిన ఓసీపీ కార్మికులు శనివారం ధర్నా చేశారు. 5 నెలలుగా తమను విధుల్లో తీసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ ఓసీపీ నుంచి మట్టి తరలించే వాహనాలను అడ్డుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ భూనిర్వాసితులైన 40 మందిని సీఆర్ఆర్ కాంట్రాక్టు సంస్థ ఉద్యోగాల నుంచి అకారణంగా తొలగించిందన్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలని 5 నెలలుగా జీఎం ఆఫీస్, స్థానిక ఎమ్మెల్యే చుట్టూ తిరిగి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీకి తమ భూములిచ్చామని, ఆ సమయంలో స్థానికులకే 80 శాతం కాంట్రాక్టు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇతర ప్రాంతాల వారిని నియమించారని చెప్పారు. తమను ఉద్యోగాల నుంచి తొలగించడంపై ప్రశ్నిస్తే పోలీసులతో అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. బ్లాస్టింగ్‌లతో తమ ఇండ్లు ధ్వంసమవుతున్నాయని, ఓసీపీతో వచ్చే దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. తమకు ఉద్యోగాలు ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని సింగరేణి యాజమాన్యానికి, సీఆర్ఆర్ కాంట్రాక్టు సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ 2 గంటలపాటు వాహనాలను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ వేణు చందర్, ఎస్ఐ సంతోష్ అక్కడికి చేరుకొని అధికారులతో చర్చించారు. రెండు రోజుల సమయం ఇవ్వాలని ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించారో విచారణ జరిపి యాజమాన్యంతో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించడానికి కృషి చేస్తామని సీఐ నిర్వాసితులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



శ్రీరాంపూర్ ఓసీపీపై మట్టి రవాణాను అడ్డుకొని ధర్నా చేస్తున్న కార్మికులు, భూనిర్వాసితులు